క్లుప్తంగా

కనుల పండువగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టించిన శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు చేస్తున్న పూరోహితులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో ఆదివారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. విగ్రహానికి కర్నూలుకు చెందిన పూరోహితులు ఆంజనేయశర్మ బృందం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉదయం 11.58 గంటలకు విగ్రహాన్ని భక్తుల హర్షధ్వన్యాల మధ్య ప్రతిష్టించారు. ప్రతిష్ట కార్యక్రమానికి వాల్మీకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఉప్పర సగర సంఘ అధ్యక్షుడు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఉప్పర కులస్తుల శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణానికిగాను ఆదివారం ఉప్పర సగర సంఘ అధ్యక్షుడు బసరకోడు వీరేంద్ర ఆధ్వర్యంలో సంఘ పెద్దలు భూమిపూజ చేశారు. ఉప్పర కులస్తులు ప్రతి ఒక్కరు ప్రహరి నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు రాముడు, యూకే రామకృష్ణ, ఎర్రగుంట్ల రాముడు, ఎల్లప్ప, బాలాజీ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



పీఠాధిపతి ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

మంత్రాలయం రూరల్ : రాఘవేంద్రస్వామి దర్శనార్థం ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావన దర్శనం చేసుకుని పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వాదం చేశారు.

క్షయవ్యాధిని అంతం చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయవ్యాధిని అంతమొందించడమే మన లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శంకర్‌నగర్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో నిర్వహించారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతీలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు తదితర లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, సుబ్బమ్మబాయి, ఇందు, లలిత, చిట్టెమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



స్వామికి పూజలు చేస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టులో శ్రావణమాసం రెండో ఆదివారం సందర్భంగా మాళమల్లేశ్వర స్వామి విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కొందరు భక్తులు సింహాసన కట్ట నుంచి కొండ పైనున్న ఆలయం వరకు మెట్టు మెట్టుకు దీపాలు వెలిగించి, బండారం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేతనాలు అందక అయ్యవార్ల అవస్థలు

- రెండు నెలలుగా బదిలీ, పదోన్నతి ఉపాధ్యాయులకు అందని వేతనాలు
- ఇంత వరకూ పొజిషన్ ఐడీ కేటాయించని విద్యాశాఖ
- ఆగస్టు నెల జీతం కూడా అనుమానమే
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. మేము అధికారంలోకి వస్తే 1వ తేదీన జీతాలు అందిస్తామని గొప్పలు చెప్పుకున్న కూటమి సర్కార్ జీతాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. అంతేకాకుండా విద్యా బోధన చేయాల్సిన తమను ఆన్‌లైన్ వర్క్‌ల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీన ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద నిరసన కూడా తెలిపారు.

250 మందికి అందని జీతాలు

ఆదోని నియోజకవర్గంలో 130 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 250 మంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు అందడం లేదు. గతంలో రెగ్యులర్‌గా జీతాలు తీసుకున్నప్పటికీ బదిలీలు, పదోన్నతి పొంది మరో స్థానానికి వెళ్లిన వారికి పోజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంది. ఈ ఐడీ ఉంటేనే వారి వివరాలు సీఎఫ్ఎంఎస్‌లో కనబడుతాయి. అప్పుడు మాత్రమే వారికి జీతాలు చెల్లించడానికి అవకాశం ఉంది. సాధారణంగా జీతాల బిల్లులు ప్రతి నెల 25వ తేదీలోపు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఇంతవరకూ పొజిషన్ ఐడీ కేటాయించకపోవడంతో ఆగష్టు నెలలో కూడా జీతం అందే పరిస్థితి లేదు. పురపాలక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వేరే ప్రాంతానికి వెళ్లి ఉంటే వారి ట్రెజరీ ఐడీలు మారడంతో వారు కూడా జీతాలు పొందే అవకాశం లేదు. దీంతో ఉపాధ్యాయులు ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు, అడ్వాన్స్‌లు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

యాప్‌లతో అవస్థలు

పాఠశాల విద్యాశాఖలో ఉన్న యాప్‌లన్నింటినీ ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి లీప్ (లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్‌ను రూపొందించారు. ఆ యాప్‌లోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మోగా పీటీఎం అంటూ 30 నుంచి 40 యాప్‌లను ఉంచారు. అయితే టీచర్ అటెండెన్స్ యాప్ సర్వర్ సరిగా పని చేయక పోవడంతో ఆన్‌లైన్‌లో టీచర్ ఫొటో హాజరు నమోదు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలస్యం అవుతుంది. అలాగే మధ్యాహ్న భోజనం నిమిత్తం పాఠశాలకు అందించిన బియ్యాన్ని ఉపాధ్యాయులు పరిశీలించి బస్తాలపై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కానింగ్ చేసి ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉంటుంది. బస్తా తెరిచిన ప్రతి సారి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఇంత టెక్నాలజీ కలిగిన యాప్‌లను రూపొందించిన అధికారులు, పాలకులు పోజిషన్ ఐడీలను కేటాయించి జీతాలు అందించడంలో జాప్యం వహిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

బోధనేతర పనులు వద్దు



ఇటీవల ప్రభుత్వం యాప్ లన్నింటినీ ఒకే వేదిక మీదకు తెచ్చి లీప్ యాప్‌ను రూపొందించారు. ప్రతిదీ కూడా ఆన్‌లైన్లో అప్‌లోడు చేయాలని వెరీ అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజ్‌లు పెట్టడం ద్వారా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నాం. నిత్యం ఎదో ఒక పని చెప్పడంతో సతమత మవుతున్నాం. పొజిషన్ ఐడీలను కేటాయించి జీతాలు చెల్లించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

–వీరచంద్రయాదవ్ ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్.

జీతాలు చెల్లించాలి



ఇటీవల పదోన్నతులు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలలుగా పొజిషన్ ఐడీలు కేటాయించ లేక పోవడం దారుణం. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని గొప్పలు చెప్పుకునే మనం కనీసం బదిలీ అయిన వారికి పోజిషన్ ఐడీలను కేటాయించి జీతాలు అందించక పోవడం విచారకరం. ఇప్పటికైనా స్పందించి జీతాలు అందించేందుకు తగు చర్యలు చేపట్టాలి.

–గాదిలింగప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం



జీఓ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

కోసిగి: విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలలో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ అన్నారు. ఆదివారం కోసిగిలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసి ఉత్తర్వుల జీవో కాపీలను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యా రంగంతో జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివకుమార్, రవి, వినోద్, చిన్న,వెంకటేష్, అభి బాలాజీ పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి అన్నారు. ఆదివారం ఎమ్మిగనూర్ సర్కిల్‌లో ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, హాజీ, రవి, వినోద్, నాని, వంశీ పాల్గొన్నారు.

ఈరన్నస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



స్వామివారి దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సీతారాంరెడ్డి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామిని ఆదివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ సీతారాంరెడ్డిలు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేకు, ఆయన సోదరునికి ఆలయ అర్చకులు, డిప్యూటీ కమిషనర్ విజయరాజు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేలకు ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్పస్వామి, వేదపండితుడు, ముఖ్యఅర్చకులు నాగరాజుస్వామిలు శాలువాకప్పి, పూలమాలతో సన్మానించారు. దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రావణమాసంలో ఆదివారం భక్తులు తక్కువ ఉంటారని భావించి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండాలన్న కారణంతో వచ్చినట్లు వారు తెలిపారు. అనంతరం బుదుములదొడ్డి ఆంజినేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, ఎంపీటీసీలు లింగన్నగౌడ్, మూకన్న, స్థానిక నేతలు, నాయకుల పలువురు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

ఆదోని రూరల్: స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకటేశులు పిలుపునిచ్చారు. సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం రెండోరోజు ఆదోని మండలంలో జరిగాయి. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏడాదికాలంలోనే ప్రజలపై సుమారు 18 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీలను పెంచి భారం మోపిందన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపుతో మరింత భారం ప్రజలపై పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి లింగన్న, మండల కార్యదర్శివర్గ సభ్యులు వీరారెడ్డి, ఉచ్చీరప్ప, రామాంజనేయులు, మునిస్వామి, పాండురంగ, తిక్కప్ప, హనుమంతరెడ్డి, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని ప్రజా ఐక్య వేదిక నాయకులు రాముడు, సురేష్, తిమ్మప్ప పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం నిర్వహించనున్న విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నా కార్యక్రమం కరపత్రాలను ఆదివారం పట్టణంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు అదాని కంపెనీతో స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. స్మార్ట్‌మీటర్లతో బడుగు బలహీన వర్గాలు, చేతి వృత్తులవారు, వ్యాపారస్తులకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందన్నారు. ఆయా మీటర్లతో ఇబ్బందులే తప్ప ప్రజలకు ఒనగూరే లాభం లేదని తెలిపారు.

హాస్టళ్లలో మౌలిక వసతులపై దృష్టి సారించండి



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కలిసిన హాస్టల్ వార్డెన్‌లు

మంత్రాలయం రూరల్ : మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. ఆదివారం రాంపురం గ్రామంలోని భీమా నిలయంలో మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు హాస్టల్ వార్డెన్లు అజీమ్, గోపాల్. సత్యనారాయణరాజులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు హాస్టల్‌లో సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే పీఏ వెంకట్రామి రెడ్డి ఉన్నారు.

7న కోడుమూరులో కుర్ణి సంఘం మహాసభ

వెల్దుర్తి: ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోడుమూరులో రాష్ట్ర కుర్ణి(నేసె) సంక్షేమ సంఘం ప్రథమ మహాసభ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోట్ల ఓమేంద్ర బాబు, కోశాధికారి కామర్తి హనుమంతప్ప, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక సంఘం ప్రతినిధులతో కలిసి మహాసభకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. కులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోట్ల రుషేంద్ర బాబు, మండల ప్రతినిధులు గోట్ల శివ, ఎల్లయ్య, రవి, శేఖర్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను స్వాధీనం చేయాలి

ఆదోని అర్బన్: అర్హులైన వారికి టిడ్కో ఇళ్లను స్వాధీనం చేయాలని లబ్ధిదారులు కమలనాథ్, పుష్పావతి, ఉషారాజ్, కాప్సే పద్మావతిబాయి, అనిల్, బాబురావు, నాగరాజు తదితరులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు ఆదివారం వినతి పత్రం అందించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ గృహాలు మంజూరైన వారికి గృహాలను స్వాధీన పరిచాలని, గృహాలు మంజూరు కాని వారికి వారు కట్టిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. తాము ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 2014–15 సంవత్సరంలో 430 చ.అ. టిడ్కో గృహాలనికి ఆదోని కమిషనర్ పేరుపై రూ.లక్ష డీడీ రూపంలో చెల్లించామన్నారు. గృహ లబ్ధిదారులుగా పట్టా ఇచ్చారు గానీ, ఇంతవరకు గృహాలను ఇవ్వలేదన్నారు. రుణం మంజూరైన వారికి గృహాలు స్వాధీన పరచకుండానే రుణ కంతులు కట్టమని నోటీసులు వస్తున్నాయన్నారు.



ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు వినతి పత్రం అందజేస్తున్న టిడ్కో గృహాల లబ్ధిదారులు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడిని పరిశీలిస్తున్న బుట్టా శివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: రైతులు పండించిన వెరుశనగ పంటకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డ్‌లో రైతులకు కావాల్సిన సౌకర్యాలను మెరుగుపర్చాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించారు. రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ దిగుబడులను పరిశీలించి రైతులతో గిట్టుబాటు ధరను అడిగి తెలుసుకున్నారు. కాగా, యార్డ్‌లో రైతులకోసం విశ్రాంతి భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విశ్రాంతి భవనం అసంపూర్తిగా వుందని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. అదేవిధంగా వర్షాకాలంలో పంట దిగుబడులు వర్షానికి తడవకుండా షెడ్లు ఏర్పాటు చేయాల్సి వుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహబుబ్‌బేగ్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు మండలంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా బనవాసి బసిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గోకారమ్మ, రైతు విభాగం ఎస్. నరసింహుడు, బీసీ సెల్ హెచ్.మహేష్, ఎస్సీ సెల్ మాల గోవిందు, మైనారిటీ సెల్ గౌస్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఎం.మల్లికార్జున, విద్యార్థి విభాగం సోమశేఖర్, పంచాయితీరాజ్ విభాగ అధ్యక్షుడిగా బోయపరుశురాముడు నియమితులయ్యారు. ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా క్రాంతికుమార్, వలంటీర్ విభాగం నరసప్ప, గ్రీవెన్స్ సెల్ వరకుమార్, వాణిజ్య విభాగం నూర్ బాషా, వీవర్స్ విభాగం నేష అంపయ్య, వైఎస్సార్ టీయూ విభాగ అధ్యక్షుడిగా మారెప్పను నియమించారు. అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలిగా సుజాత, లీగల్ సెల్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కల్చరల్ విభాగం బజారి, సోషల్ మీడియా విభాగం ఈడిగ రామకృష్ణ గౌడ్, ఐటీ వింగ్ పి.వెంకటేష్, దివ్యాంగుల విభాగం విజయలక్ష్మి, డాక్టర్స్ విభాగం పి.సురేష్, ఇంటలెక్చువల్ ఫోరం పోలయ్య, బూత్ కమిటీ సత్యారెడ్డి, పబ్లిసిటి విభాగ అధ్యక్షుడిగా రాఘవేంద్ర నియామకమయ్యారు.

గోనెగండ్ల మండలం..

గోనెగండ్ల : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం గోనెగండ్ల మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించింది. వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం మండల అధ్యక్షుడిగా షేక్ జహంగీర్, మహిళా విభాగం రెడ్డి కొండ అరుణమ్మ, రైతు విభాగం కె. లోకేశ్వర్ రెడ్డి, బీసీ సెల్ బి. ధనుంజయ, ఎస్సీ సెల్ మురవణి నాగేష్, ఎస్టీ సెల్ ఎరుకల హనుమేష్, మైనార్టీ సెల్ మిడుతూరు కమాల్ బాషా, క్రిస్టియన్, మైనార్టీ సెల్ ఆర్. బజారి, విద్యార్థి విభాగం కాప మద్దిలేటి రెడ్డి, పంచాయతీ విభాగం ఎస్. మహేష్ రెడ్డి, ఆర్‌టీఐ విభాగం రెడ్డిగారి జైపాల్ రెడ్డి, వలంటీర్ విభాగం కె. మల్లికార్జున, గ్రీవెన్స్ సెల్ సుందర రావు, వాణిజ్య విభాగం పింజరి చిన్న, వీవర్స్ వింగ్ మాదిగుండు, వైఎస్సార్‌టీయూసీ గొల్ల లక్ష్మన్న, లీగల్ సెల్ అధ్యక్షుడిగా జి. హనుమంతు నియామకమయ్యారు. కల్చరల్ వింగ్ అట్లా మునేశ్వర, సోషల్ మీడియా కురువ దినాకర్, ఐటీ వింగ్ ముల్లా మహమ్మద్ బాషా, దివ్యాంగుల విభాగం వీ. రాముడు, డాక్టర్స్ వింగ్ షేక్ కరీమ్ బాషా, ఇంటిలెక్చువల్స్ ఫోరం సి. రామ్మోహన్ రెడ్డి, బూత్ కమిటీ విభాగం మాల్‌త్తూరు రంగ, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా షేక్ బగిలిని నియమించారు.

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో..

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ఆదోని మున్సిపల్ అధ్యక్షుడిగా దేవాను నియమిస్తూ వైఎస్సార్సీపీ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆదోని మున్సిపల్ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వుల జారీ అయ్యాయి. యూత్ వింగ్ అధ్యక్షులుగా ఆసీఫ్ ఇక్బాల్ నిజమల్, మహిళా విభాగం సుగుణమ్మ, రైతు విభాగం నామాల శ్రీరంగ, బీసీ సెల్ మునిస్వామి, ఎస్సీ సెల్ రమేష్, ఎస్టీ సెల్ ఎరుకల వీరేష్, ముస్లిం మైనార్టీ సెల్ సిద్దిక్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అఖిల్‌కుమార్ నియమితులయ్యారు. స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, పంచాయతీ రాజ్ వింగ్ మాధవరెడ్డి, మున్సిపల్ వింగ్ బండారి చక్రపాణి, ఆర్‌టీఐ వింగ్ ఉదయ్‌బాలాజీ, వలంటీర్స్ వింగ్ గొల్ల సాయి, గ్రీవెన్స్ సెల్ రవి తేజరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మోహన్ బాబు, వీవర్స్ వింగ్ కాకే భాస్కర్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులుగా వీరేష్‌ను నియమించారు. అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా రేణుక, లీగల్ సెల్ అబ్దుల్ అహద్, కల్చరల్ వింగ్ మల్లికార్జున, సోషల్ మీడియా తిమ్మాపూర్ ఫలరుద్దీన్, ఐటీ వింగ్ విజయ్‌కుమార్, ఇంటెలెక్చువల్ ఫోరం చాంద్‌బాషా, మూత్ కమిటీస్ వింగ్ దినేష్‌బాబు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా షెక్షావలి నియమించబడ్డారు.



క్యూ లైన్‌లో తరలివస్తున్న భక్తులు



పందిరి కింద సేద తీరుతున్న భక్తులు

ఉరుకుంద..భక్తులతో కిటకిట

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. రెండవ, మూడవ సోమవారం అంటేనే సుమారు 2నుంచి 3లక్షల మంది భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకుంటరన్న అంచనా. ఈ నేపథ్యంలో సోమవారం రోజు అధికంగా ఉంటారని భావించిన చాల మంది భక్తులు ఆదివారం నుంచి తరలివస్తుండడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకుంటున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ దర్శనంల ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాత్రంతా దర్శనాలు ఉంటాయని, రాత్రి 12గంటల అనంతరం పూజల కోసం అరగంట పాటు దర్శనాలు నిలిపివేస్తామని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కౌతాళం సీఐ అశోక్ కుమార్‌తో పాటు మరో నల్గురు సీఐలు ఎస్ఐలు, పోలీసులు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

దారులన్నీ ఉరుకుంద వైపే..

మంత్రాలయం : మహిమాన్వితుడు ఉరుకుంద ఈరన్న ఉత్సవం. అడుగడుగునా భక్తజనం సందోహం. దారులన్నీ వాహనాల మయం. దారులన్నీ ఉరుకుంద వైపు మళ్లాయి. ఆదోని, కోసిగి, కౌతాళం, మాధవరం రహదారుల్లో వాహనాలు బారులు తీరాయి. స్వామి దర్శనార్థం లక్షలాదిగా భక్తులు తరలి వచ్చారు. కోసిగి, మంత్రాలయం మండల కేంద్రాలు, మాధవరంతో గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడ్డాయి. వాహనాల కోలాహలంతో దారులన్నీ సందడిగా మారాయి.



కోసిగి మండల కేంద్రంలో ఉరుకుంద వెళ్లేందుకు బారులు తీరిన వాహనాలు